RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 357 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శనివారం, 29 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-




# 'మాఫీ' దిశగా అడుగులు

## రుణమాఫీపై రేవంత్ కీలక ప్రకటన..

## పక్కాగా ఏమేం ఉండాలంటే..?

న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఆగస్టు-15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి .. మీడియా మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి క్లియర్ కట్‌గా చెప్పేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారు తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి ఒక్క మాటలో చెప్పేశారు.

**మార్పులు, చేర్పులు..! :** 'కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యువల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తాము. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**కరెంట్ కోతలు, ఆర్టీసీపై..! :** 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడింది. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటాయి. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాను. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలకు మించి బడ్జెట్ ఉండకూడని అధికారులకు అదేశాలిచ్చాం. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా 350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తుంది. 30 శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. దీనివలన ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తుంది.

మహిళల ఉచిత రవాణా సదుపాయాన్ని ప్రభుత్వం ప్రతినెలా చెల్లిస్తోంది. దాని కారణంగానే.. ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు.

**వాట్ నెక్స్ట్..? :** 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాల పై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయం లో కమీషన్ ఏర్పాటు చేస్తామని చెప్పాం. అసెంబ్లీలో చర్చించి బడ్జెట్ సమావేశాల తరువాత కమిషన్ నియమిస్తాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలు అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తరువాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళతాం. రాష్ట్రం 7 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. మరో లక్ష కోట్ల వరకు పెండింగ్ బిల్స్ ఉన్నాయి. నెలకు రూ. 7 వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు 6500 కోట్లు కట్టేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ వడ్డీకి తీసుకున్న రుణాలు తక్కువ వడ్డీకి మార్చుకునే పనిలో ఉన్నాం. కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. 7 నుంచి11 శాతం వడ్డీ వరకు రుణాలు తెచ్చారు. అవకాశం ఉన్నంత వరకు వడ్డీ తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఒక శాతం వడ్డీ తగ్గినా నెలకు 700 కోట్ల భారం తగ్గుతుంది. కేంద్రంతో చర్చలు జరిపి రుణాలకు వడ్డీ తగ్గించే అంశం ఒక కొలిక్కి తీసుకొస్తాం. అవసరమైతే తక్కువ వడ్డీకి ఇచ్చే వారి నుంచి డబ్బు తీసుకుని ఎక్కువ వడ్డీకి డబ్బు తెచ్చిన అప్పులు తీర్చేస్తాం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి సారించాం' అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**ప్రశ్నించరేం..? :** 'అన్ని శాఖలకు సంబంధించిన మంత్రులు, కేంద్ర మంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు. బడ్జెట్‌కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలు కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10 ఏళ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు..? కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు' అని ఉదహరించి మరీ రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు మహిళలకు పీసీసీ ఇస్తే బానే ఉంటుందని సీఎం సమాధానం ఇచ్చారు. విలేకరుల సూచనలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చని.. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, ఈబీసీలు కూడా ఉండొచ్చన్నారు. ఫిరాయింపుల తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదని.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు.



## నీట్‌పై చర్చకు ఇండియా కూటమి సిద్ధం

దిల్లీ: లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులనుద్దేశించి వీడియో సందేశం విడుదల చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో చర్చలు జరపడమే ఇండియా కూటమి లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో శాంతియుతంగా చర్చించడానికి విపక్ష నేతలు సిద్ధంగా ఉన్నారన్నారు. నేడు లోక్‌సభలో నీట్ విషయం మాట్లాడుతుండగా తన మైక్‌ను కట్ చేశారని మండి పడ్డారు. "నీట్ పేపర్ లీక్ గురించి అందరికీ తెలుసు. విద్యార్థులకు నష్టం కలిగించి, కొందరు మాత్రం వేల కోట్ల రూపాయలు సంపాదించారు. ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా చదువుతుంటారు. పవిత్రమైన వైద్య వృత్తిని చేపట్టడం వారి కల. గురువారం విపక్షాల సమావేశంలో ఈ విషయం గురించి చర్చించాం. విద్యార్థుల సమస్యలపై వారి తరపున పోరాడాలని నిర్ణయించాం" అని తెలిపారు.




## ఆరుగురు దుర్మరణం

షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాసు పరిశ్రమలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. ఈ పేలుడుతో పరిశ్రమ వద్ద భీతావహ వాతావరణం నెలకొంది. గాజు పరిశ్రమ కావడంతో కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. ఈ ఘటనలో 15మందికి గాయాలు కాగా.. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఒకేసారి కంప్రెషర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ దుర్ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా ఆరా తీస్తున్నారు. మృతులు ఒడిశా, బిహార్, యూపీ వాసులుగా గుర్తించారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు కార్మికసంఘం నేతలు చెబుతున్నారు.

గతంలో ఇక్కడ ఇలాంటి ఘటన జరిగినప్పుడే కార్మికుల భద్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన సూచనల్ని ఏ మేరకు పాటించారనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సౌత్ గ్లాస్ పరిశ్రమను శంషాబాద్ డీసీపీ రాజేశ్ పరిశీలించారు.

**క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశం :** షాద్‌నగర్‌లో జరిగిన ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారుల్ని అప్రమత్తం చేసిన ఆయన.. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ దుర్ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# పార్టీని వీడే వారి గురించి ఆలోచించొద్దు

## జంపింగ్ ఎమ్మెల్యేలపై కేసీఆర్ షాకింగ్ కామెంట్స్

ఎర్రవల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒకరి తర్వాత మరొకరు వరుసగా అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంపింగ్ చేస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పార్టీ నుంచి పోయి దొంగల్లో కలుస్తున్న నాయకుల గురించి ఏమాత్రం ఆలోచించాల్సిన అవసరం లేదని, ఒకరు పోతే పదిమంది నాయకులను పార్టీ తీర్చిదిద్దుకుంటుందని కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని అన్నారు. సమైక్యవాదులతో కలబడి నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఈ పరిస్థితులు ఒక లెక్కనా అని అన్నారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ధైర్య వచనాలు చెప్పారు. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు.

**మొన్నటి ఎన్నికల్లో ప్రజలు బోల్తాపడ్డారు :** కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారని, మొన్నటి ఎన్నికల్లో అదే జరిగిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దతీ, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదని పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. ఏ హోదాలోవున్న కానీ ప్రజల కోసం పని చేయాల్సిందేనని, అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను బీఆర్ఎస్ మాత్రమే నెరవేరుస్తుందన్నారు.

**మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు :** "ఆనాడు ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు?. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటది" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్‌గా మరోపక్క ఎమ్మెల్యేగా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. కాగా ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా సంజయ్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బాల్క సుమన్,జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ, జగిత్యాల జెడ్పీ చైర్మన్ వసంత సురేష్, పెద్దపెల్లి టీఆర్ఎస్ నేత ఉష తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ జిల్లా నేతలతోనూ భేటీ :** అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, జాజల సురేందర్, హన్మంత్ షిండే, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## విద్యుత్ ఒప్పందాలు
## కేసీఆర్ వాదనలో నిజమెంత ?

కేసీఆర్ హయాంలో తెలంగాణలో అధికారంలో ఉన్న సమయలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టారు. దాంతో పాటు ఛత్తీస్ ఘడ్ నుండి విద్యుత్ కొనుగోలు చేశారు. అధికధరకు విద్యుత్ కొనుగోలు చేసి అవతవకలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందు కోసం జస్టిస్ ఎల్. నరసింహారెడ్డితో జ్యుడిషీయల్ కమిషన్ ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జీవోను జారీ చేసింది. అయితే విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ జీవోను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టులో పిటీషన్ వేశారు. దీనికి ముందు కేసీఆర్ ను కమిషన్ ముందు హజరు కావాలని జస్టిస్ ఎల్. నరసింహరెడ్డి కమిషన్ లేఖ రాసింది. ఈ నెల 19న కేసీఆర్ కు కమీషన్ నుండి లేఖ అందింది. వారం రోజుల్లోపుగా కమీషన్ ముందు హజరు కావాలని కోరింది. అయితే జూన్ 25తో వారం రోజుల గడువు పూర్తైంది. దీంతో మరోసారి కమిషన్ నుండి కేసీఆర్ కు లేఖ పంపారు. తన అభిప్రాయాలు చెప్పాలని ఆ లేఖలో కోరారు. కేసీఆర్ తో పాటు అప్పట్లో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీష్ రెడ్డికి కూడా కమిషన్ లేఖ రాసింది. అయితే అసలు కమిషన్ ఏర్పాటునే బీఆర్ఎస్ నాయకులు తప్పుబడుతున్నారు. విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా, ఒప్పందాలు, వివాదాలు అన్నీ విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలోనే ఉంటాయని కేసీఆర్ చెబుతున్నారు. జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వ పరిధిలో లేదన్నది బీఆర్ఎస్ వాదన. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్టంలోని 61, 62, 86 సెక్షన్లకు విరుద్దంగా ఈ జీవో ఉందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హైకోర్టులో కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలుకు సంబంధించి అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి ఈఆర్సీలోనే తన అభ్యంతరాలను వ్యక్తం చేశారని ఈ సంధర్భంగా గుర్తు చేస్తున్నారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలు విషయమై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని కోరుతూ కేసీఆర్ ఈ నెల 15న లేఖ రాశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో విద్యుత్ రంగంలో చేసిన కృషిని ప్రస్తావించారు. అప్పట్లో తెలంగాణలో ఉన్న విద్యుత్ కొరతను దృష్టిలో ఉంచుకొని ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వంతో పీపీఏ చేసుకున్నట్టుగా వెల్లడించారు. ఛత్తీస్ గఢ్ తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని తప్పుబట్టే విధంగా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ మాట్లాడడంపై లేఖలో కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ను దామరచర్లలో ఏర్పాటు చేయడానికి గల కారణాలను వివరించారు. విచారణ పూర్తి కాకుండానే మీడియా సమావేశంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టేలా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మాట్లాడడాన్ని తప్పుపట్టారు. విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని ఆయన కోరారు. ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందంలో అవతవకలు ఎలా ఉంటాయని, ఈ లెక్కన అప్పటి చత్తీస్ ఘడ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ కు కూడా నోటీసులు ఇవ్వాలన్నది బీఆర్ఎస్ వాదన.

ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటీషన్ మీద హైకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుంది అన్నది ఉత్కంఠ రేపుతున్నది.

## విపత్తులో దన్ను.. ఆక్రమణలపై మూడో కన్ను



హైదరాబాద్: రాజధాని చుట్టుపక్కల ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరోధించలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రకృతి విపత్తు సంభవించినపుడు ఎదుర్కొనే పెద్ద వ్యవస్థ మహానగరంలో లేదు. ఈనేపథ్యంలో భూముల రక్షణ, విపత్తు స్పందన సంస్థ (అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్)ను ఏర్పాటు చేయాలని సర్కార నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థ పని చేయనుంది. ఐజీ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఇద్దరు ఎస్పీలు, పలు విభాగాల అధికారులతో కలిపి మొత్తం 3 వేల మంది ఇందులో పని చేయనున్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు ఈ సంస్థ కీలకంగా మారనుంది. గత ప్రభుత్వ హయాంలో బల్దియా కమిషనర్ ఆధ్వర్యంలో పని చేసేలా ఎన్‌ఫోర్సుమెంట్, విజిలెన్సు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం)ను ఏర్పాటు చేశారు. దీనికి ఐపీఎస్ అధికారిని డైరెక్టర్‌గా నియమించింది. దీనికింద 900 మంది సిబ్బంది ఉన్నా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. రాజధాని చుట్టూ రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిని కాపాడే వ్యవస్థ లేదు. ఈనేపథ్యంలో సరికొత్త సంస్థను ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. ఇందులో భాగంగానే అసెట్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థ రూపుదిద్దుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలతో జీవో త్వరలో రానుందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఈ సంస్థ స్వయం ప్రతిపత్తితో పని చేయనుంది.

**7 జిల్లాల పరిధిలో..**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్, సిద్ధిపేట జిల్లాల పరిధిలో ఈ సంస్థ పని చేస్తుంది. మొత్తం 70 మండలాలు విస్తరించి ఉంది. జీహెచ్ఎంసీతోపాటు నిజాంపేట, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, మీర్‌పేట నగరపాలక సంస్థలు, 30 పురపాలక సంఘాలు దీని పరిధిలోకి వస్తాయి.

**సమర్థులైన అధికారుల కోసం..**

కొత్త సంస్థలో పని చేయడానికి సమర్థులైన అధికారుల కోసం సర్కారు అన్వేషణ చేస్తోంది. ఐజీ ఏవీ రంగనాథ్‌ను ఈ సంస్థ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులు, ఇతర విభాగాల అధికారులను నియమించనున్నారు.

**నూతన సంస్థ చేసే పనులివీ**

బల్దియా, హెచ్ఎండీఏ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతను నూతనంగా ఏర్పాటు చేయనున్న 'భూముల రక్షణ, విపత్తు స్పందన సంస్థ' తీసుకోబోతుంది. ప్రభుత్వ భూములు ఎక్కడ ఆక్రమణకు గురయ్యాయో గుర్తించి స్వాధీనం చేసుకోనుంది. రాజధానిలో చిన్నాపెద్దా నాలుగు వేల వరకు చెరువులున్నాయి. కొన్ని ఆక్రమణకు గురికాగా మరికొన్నింటిపై ఆక్రమణదారులు కన్నేశారు. ఈ నేపథ్యంలో ఈ చెరువుల రికార్డులను వెలికితీసి ఆక్రమణల నుంచి కాపాడుతుంది. బల్దియా, హెచ్ఎండీఏ విజిలెన్సు విభాగాలను కొత్త సంస్థలో విలీనం చేయనున్నారు. అక్రమ నిర్మాణాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోనుంది. మహానగరంలో భారీవర్షం పడితే ప్రధాన రోడ్లు చెరువుల్లా మారిపోయి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ నేపథ్యంలో సంస్థలోని సిబ్బంది ఆధునిక యంత్రాలతో రోడ్లపైకి వస్తారు. రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై సైతం చర్యలు తీసుకుంటారు. ఈ సంస్థకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయనున్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెండు అంతస్తులను కేటాయించనున్నారు.

## మేల్కొనకపోతే.. నిత్య నరకమే



హైదరాబాద్: రోడ్లు ఎంత విశాలంగా ఉన్నా.. వాహన రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. 150 అడుగుల, 100 అడుగుల రహదారులైనా నిత్యం కిక్కిరిసిపోతున్నాయి. కొత్తగా నిర్మించిన పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌యూబీలతో సమస్య కొంత వరకే పరిష్కారమైంది. అదే సమయంలో కొత్త ట్రాఫిక్ చిక్కులూ తెరపైకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇష్టానుసారం చేపడుతోన్న అభివృద్ధి పనులు, నిర్మాణ అనుమతులే నగరానికి శాపంగా మారుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేపట్టి, గుర్తించిన సమస్యలకు పరిష్కారాలను కనిపెడితేనే నగరం భవిష్యత్తు బాగుంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు.. జేఎన్‌టీయూ కూడలి నుంచి గచ్చిబౌలి ఓఆర్ఆర్ వరకు రహదారి వెడల్పు 100 నుంచి 150 అడుగులు ఉంది. అయినా వాహనాలు బారులు తీరుతున్నాయి. జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ వరకు పైవంతెన, అయ్యప్ప సొసైటీ, మైండ్‌స్పేస్ కూడళ్లలో అండర్‌పాస్‌లు, మరో రెండు పైవంతెనలను నిర్మించిన విషయం తెలిసిందే.

మెహిదీపట్నం నుంచి టోలిచౌకి మీదుగా గచ్చిబౌలి వెళ్లే వాహనాలు ముక్కుతూ.. మూలుగుతూ వెళ్తున్నాయి. ఈ దారిలో పైవంతెన అందుబాటులోకి వచ్చినప్పటికీ.. దానిపై వెళ్లిన వాహనాలన్నీ ఖాజాగూడ చౌరస్తా నుంచి వెనక్కి ఆగుతున్నాయి. టోలిచౌకిలో రోడ్డు ఆక్రమణలు రద్దీకి కారణమవుతున్నాయి.

భారీ నిర్మాణాలతోనూ మూసాపేట నుంచి కైత్లాపూర్ వెళ్లే రోడ్డు వంద అడుగుల వెడల్పు ఉంటుంది. ఇక్కడ నాలుగు ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే నాలుగు పూర్తయ్యాయి. తక్కువ ప్రదేశంలో వేలాది ఇళ్ల నిర్మాణం జరిగింది, వారంతా కార్లతో రోడ్లపైకి వస్తే.. ముమ్ముందు ఎలా ఉండనుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

దృష్టిపెట్టిన సర్కారు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నగర యంత్రాంగం ఇప్పటికే ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టింది. మూడు కమిషనరేట్ల పరిధిలో 127 కూడళ్ల విస్తరణకు జీహెచ్ఎంసీ ఆమోదం తెలిపింది. అయితే బల్దియా వద్ద నిధుల్లేవు. సర్కారు నుంచి విడుదల వ్వట్లేదు. నిధుల సమస్యను తీర్చి, ట్రాఫిక్ సమస్యపై అధ్యయనం చేయించి, నిర్మాణ అనుమతులపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేటు బడుల్లో నిబంధనలు బేఖాతర్



పెద్దపల్లి : ప్రైవేటు విద్యాలయాలు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం నియమ నిబంధనలను బేఖాతరు చేస్తూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు చదువు మాత్రమే చెప్పాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగుల పేరిట పాఠశాలలోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేయవద్దని స్పష్టంగా మార్గదర్శకాలు జారీ చేసినా జిల్లావ్యాప్తంగా ఎక్కడా వీటిని అమలు చేయడం లేదు. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా విద్యా హక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి.

పట్టించుకునేవారేరీ..ప్రైవేటు విద్యా సంస్థల్లో ఏవీ విక్రయించొద్దనే అధికారిక ఆదేశాలున్నాయి. దీంతో విద్యాసంస్థల నిర్వాహకులు కొత్త దారి ఎంచుకుంటున్నారు. తమ పాఠశాల సమీపంలో ఉండే ఓ గృహ సముదాయాన్ని తాత్కాలికంగా అద్దెకు తీసుకుని అందులోనే పాఠశాల పేరుతో ఉండే స్టేషనరీ సామగ్రిని విక్రయిస్తున్నారు. తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల రుసుం కట్టిన తర్వాత ఓ చిట్టీపై చదువుకోవడానికి అవసరమైన సమస్త జాబితాను రాసి అద్దె భవనానికి వెళ్లి కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో ప్రముఖ ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ పంథానే అనుసరిస్తున్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు అన్నీ పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి అంతా దర్జాగా ఇక్కడే విక్రయిస్తున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి రూ.3వేల వరకు పుస్తకాలకే వసూలు చేస్తున్నారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థికి అదనంగా ఐఐటీ తరగతుల పేరిట ఒక్కో పుస్తకాన్ని రూ.650 పెట్టి వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు, పరీక్షల రుసుంలు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఎంఈవోలతో తనిఖీ చేయిస్తాం**

ప్రైవేటు పాఠశాల్లో అనుమతులు, వసతుల కల్పన, ఫీజుల నియంత్రణ అంశాలపై ఆయా మండల విద్యా శాఖ అధికారుల(ఎంఈవో)తో తనిఖీలు చేయిస్తాం. నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులు రద్దు చేస్తున్నాం. ఇప్పటికే గోదావరిఖనిలోని సప్తగిరికాలనీలోని ఓ ప్రైవేటు బడిని సీజ్ చేశాం. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తాం. మాధవి, జిల్లా విద్యా శాఖ అధికారి

## ఆగని దందా.. అదే పంథా

కరీంనగర్ : 'ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం. మానేరు వాగుతో పాటు ఇతర వనరుల నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుల భరతం పడతాం. దీని వెనుక ఏ నాయకుడున్నా వదిలిపెట్టం. సహకరిస్తున్న పోలీసులు, అధికారులను గుర్తించి వారిపై కఠిన చర్యలుండేలా మా పోరాటం ఉంటుంది.' ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులో మంగళవారం ఇసుక మాఫియా దుశ్చర్యలో ఓ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. పట్టుబడిన ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చుని వస్తుండగా, డ్రైవర్ దాన్ని చెరువులోకి మళ్లించి తను దూకేశాడు.

రెండు రోజుల కిందట వేములవాడ మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా అడ్డుకున్న మైనింగ్ అధికారితో ట్రాక్టర్ల డ్రైవర్లు దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఆపకుండా వెళ్లేందుకు యత్నించారు. తమకు అడ్డు రావద్దంటూ అధికారితో వాగ్వాదానికి దిగారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక దందా పంథా మారడం లేదు. క్షేత్ర స్థాయిలో వేళ్లూనుకుపోయిన మాఫియా.. దర్జాగా దౌర్జన్యానికి పాల్పడుతోంది. ఇసుకాసురులపై కఠిన చర్యలు లేక రెచ్చిపోతున్నారు. అక్రమ రవాణాతో జేబులు నింపుకొంటూ అడ్డొచ్చినవారిపై దాడులకు పాల్పడుతున్నారు. మానేరు, మోయతుమ్మెద, మూల వాగులు, గోదావరి నది పరీవాహక ప్రాంతాల నుంచి రాత్రింబవళ్లు సహజ వనరులను దోస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిత్యం దాదాపు 4 వేలకు పైగా ట్రాక్టర్లలో టన్నుల కొద్దీ ఇసుక తరలిస్తుండటంతో ఆందోళన కలిగిస్తోంది. పోలీసు, రెవెన్యూ అధికారుల ఉదాసీనతకు తోడు స్థానిక నాయకుల అండతో



దందా కొనసాగుతోంది.

**యంత్రాంగం ప్రేక్షక పాత్ర**

ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. పదే పదే ఫిర్యాదు వస్తే మొక్కుబడిగా కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. వాస్తవానికి వాల్టా(నీరు నేల వృక్షం చట్టం) ఉల్లంఘించే వారిని ఆయా శాఖల అధికారులు సమష్టిగా కట్టడి చేయాలి. కానీ ఎవరికి వారు 'తమకెందుకులే' అన్న ధోరణితో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక దందాపై చోటామోటా నాయకుల పైరవీలు, నేతల ఒత్తిళ్లతో యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. విచ్చలవిడిగా ఇసుక రవాణాతో రహదారి ప్రమాదాలు పెరిగాయి. మైనర్లు ట్రాక్టర్లను నడిపిస్తుండటం పరిపాటిగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఏటా ఇసుక ట్రాక్టర్లతో దాదాపు 200 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు ఘటనల్లో ద్విచక్రవాహనదారులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, ఆర్టీఏ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి సమష్టిగా ఇసుక దందాకు అడ్డుకట్ట వేయకుంటే ముమ్ముందు మరింత రెచ్చిపోయే ప్రమాదం లేకపోలేదు.

పరీవాహకంలో అదే ఆదాయం జలాశయాలు, నీటి పరీవాహక ప్రాంతాలు అధికంగా ఉన్న నాలుగు జిల్లాల్లో వందలాది మందికి ఇసుక రవాణా ఆదాయ మార్గంగా మారింది. అధికారిక రీచ్‌లు ఉన్నా వందలాది ట్రాక్టర్లలో దొడ్డి దారిన తరలిస్తున్నారు.

వర్షాకాలంలో వాగులు, వంకల్లో నీళ్లు నిలవకముందే అందినకాడికి దోచుకోవాలన్న ఆలోచనతో కొద్ది రోజులుగా అక్రమార్కులు జోరు పెంచారు. డీజిల్, కూలీల ఖర్చులు పోగా ట్రాక్టర్ ఇసుక విక్రయంతో రూ.1500-2000 సంపాదన వస్తుండటంతో చాలా మంది ఈ వ్యాపారానికి అలవాటు పడ్డారు. నది, వాగు పరీవాహక ప్రాంత గ్రామాల్లో వందల సంఖ్యలో ట్రాక్టర్లను కేవలం ఇసుక రవాణా కోసమే కొనుగోలు చేస్తున్నారు. పలు చోట్ల సిండికేట్‌గా మారి ప్రతి రోజు ఒక్కో వాహనం 6-10 ట్రిప్పులు తరలించుకునేలా ఒప్పందాలు చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు ఈ మాఫియాకు పెద్దలుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకోవడం, మామూళ్లు ఇవ్వడం వంటి పనులను వీరు చక్కబెడుతుంటారు. ఎక్కడైనా, ఎవరైనా ఫిర్యాదు చేసినా బెదిరించడం, దాడికి పాల్పడటం వంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

## వ్యయం తగ్గి.. వెలుగులు పంచేలా

తూప్రాన్: విద్యుత్తు ఖర్చులు తగ్గించుకునేందుకు తూప్రాన్ పురపాలిక అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం చుట్టారు. కార్యాలయానికి సౌర విద్యుత్తు అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. రూ.20లక్షలకు పైగా నిధులతో కార్యాలయంపై సౌర పలకలను ఏర్పాటు చేశారు. పురపాలిక కార్యాలయంతో పాటు విభాగినులపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలకు నెలకు రూ.2లక్షల వరకు కరెంటు బిల్లులు వస్తున్నాయి. ఈ వ్యయాన్ని తగ్గించుకునేందుకు అధికారులు ఆలోచనలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రూ.20.60లక్షల నిధులతో సౌర పలకల యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పురపాలిక కార్యాలయం, విభాగినులపై ఏర్పాటు చేసిన దీపాలకు సైతం విద్యుత్తును వినియోగించేలా ప్రణాళికలు చేశారు. ప్రస్తుతం కార్యాలయంపై సౌర పలకల బిగింపు పూర్తయ్యింది. త్వరలోనే దీనిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.24లక్షలకు పైగా ఆదా తూప్రాన్ పురపాలికలో నెలకు రూ.2లక్షలకు పైగా విద్యుత్తు బిల్లులను చెల్లిస్తున్నారు. ఇలా ఏడాదికి రూ.24లక్షలకు పైగా వ్యయం అవుతోంది. సౌర పలకల ద్వారా ఏడాదిలో ఈ వ్యయం పూర్తికానుంది. 5 ఏళ్ల వరకు గ్యారంటీ ఉండగా 30ఏళ్ల వరకు వినియోగంలో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో దీని ద్వారా ఉత్పత్తి అయ్యే మిగులు విద్యుత్తును సైతం విద్యుత్తు శాఖకే విక్రయించేందుకు వెసులుబాటు ఉంది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలపై వీటిని ఏర్పాటు చేయగా పురపాలిక కార్యాలయంపై ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఇది విజయవంతమైతే ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలిక కార్యాలయాలపై దీనిని ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు చేస్తున్నారు. ఈ వారం రోజుల్లోనే దీనిని ప్రారంభించి సోలార్ ద్వారానే విద్యుత్తు వెలుగులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బిల్లులు అధికంగా రావడంతో కొన్ని విద్యుత్తు దీపాలను సైతం పూర్తిగా ఆన్ చేయడం లేదు. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తొలగనుండటంతో రాత్రి సమయంలో నిరంతరం పురపాలికలో విద్యుత్తు వెలుగులు విరజిమ్మనున్నాయి. సద్వినియోగం చేసుకుంటాం: ఖాజామొయినొద్దీన్, కమిషనర్ పురపాలిక, తూప్రాన్‌తూప్రాన్ పురపాలిక కార్యాలయంపై రూ.20లక్షలకు పైగా నిధులతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం. ప్రధానంగా పురపాలిక కార్యాలయంలో విద్యుత్తు బిల్లులను ఆదా చేసేందుకే దీనిని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం.

# పొడిగిస్తారా.. ప్రత్యేక పాలన..

వికారాబాద్: సర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది. జులై 4న జిల్లా, మండల పరిషత్ ఛైర్మన్ల పదవీకాలం ముగియనుంది. వారిని కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయంపై చర్చ జరుగుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై సర్కారు దృష్టి

వికారాబాద్ జిల్లాలో జడ్పీ ఒక స్థానం, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. బీసీ జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలని ఒక వైపు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలని అప్పటి ప్రభుత్వం చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ




విషయంలో ఏ చేస్తుందో వేచి చూడాల్సిందే.

రూ.47.43 కోట్లతో అభివృద్ధి పనులు

ఐదేళ్ల జిల్లా పరిషత్ పాలకవర్గం పాలనలో రూ.47.43 కోట్లతో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగాయి. వీటిలో సాధారణ నిధులు రూ.21.5 కోట్లు, 15వ ఆర్థిక సంఘం హెల్త్ సెక్టార్ కింద రూ.6.95 కోట్లు, 15వ ఆర్థిక సంఘం కింద రూ.10 కోట్లు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ (ఎస్ఎంజీ) కింద రూ.4.19 కోట్లు, స్పెషల్ గ్రాంట్ (ఎస్జీ) కింద రూ.4.74 కోట్లు ఉన్నాయి. ఈ నిధులతో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి కాగా, మిగతా 10 శాతం పనులు ముగింపు దశలో ఉన్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో ప్రజావసరాలకు తగినట్లుగా నిర్మాణాలు కొనసాగాయి.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు

గడచిన ఐదేళ్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. జడ్పీ పాలక వర్గంలో రాజకీయాలు ఎలా ఉన్నా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగాయి. ఇంకా చేపట్టాల్సినవి, తుది దశలో ఉన్నవి వీలైనంత త్వరగా పూర్తిచేయిస్తాం. నిధులు సద్వినియోగం చేస్తాం. సుధీర్, సీఈఓ, జిల్లా పరిషత్, వికారాబాద్

# లక్ష్యం సరే.. అమలెక్కడ?

సారంగాపూర్: పల్లెలను పరిశుభ్రంగా మార్చాలని గ్రామ పంచాయతీలలో కంపోస్టు (సెగ్రిగేషన్) షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన నిర్వహణ లేక రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలలో పల్లె ప్రగతిలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణాలు చేపట్టారు. సెగ్రిగేషన్ షెడ్డు చెత్త పోగేయడానికి సరిపోతుంది. పలు షెడ్లు ఈదురు గాలులకు లేచిపోగా, పలు వైకుంఠధామాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. పల్లె ప్రకృతి వనాలపై పంచాయతీలు దృష్టి సారించకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. ఉద్దేశం మంచిదే అయినప్పటికీ నిర్వహణ లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి.

దృష్టి సారిస్తేనే ప్రయోజనం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి దాని ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. ఇందుకు గతంలో తడి, పొడి చెత్తను సేకరించడానికి అధికారులు ఆకుపచ్చ, నీలం చెత్త బుట్టలు కూడా ఇంటింటికి పంపిణీ చేశారు. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ వేరు చేసి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. తయారైన ఎరువును హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలి. మిగిలిన ఎరువులను రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలి. పొడి చెత్తను షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుండీలలో వేర్వేరు చేయాల్సి ఉంటుంది. అయితే జనాభా ప్రతిపాదికన పారిశుద్ధ్య కార్మికులను నియమించుకోవాల్సి ఉంటుంది. గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించేందుకు సరిపోతున్నారు. పంచాయతీలకు ఆదాయం లేకపోవడం.. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రాకపోవడంతో అదనపు సిబ్బంది నియామకం లేకుండా పోతుంది. దీనివల్ల ఎక్కడా సేంద్రియ ఎరువుల తయారీ చేసే పరిస్థితి కనపడటం లేదు. చేసేదేమీలేక గ్రామం నుంచి తీసుకెళ్లిన చెత్తను పక్కనే పడేసి కాల్చివేయాల్సి వస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

పల్లెల్లో ఇప్పటికే సర్పంచుల కాలపరిమితి ముగియడంతో మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారుల బాధ్యతలు అప్పగించారు. అప్పటికే వారిశాఖలో బిజీగా ఉండడంతో కేవలం నిధుల విడుదల, ప్రభుత్వ పథకాల పరిశీలనలకే సరిపోతున్నారు. దీనివల్ల గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతుంది. మురుగు కాలువల నిర్వహణ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితి నెలకొంటోంది. అదేవిధంగా వైకుంఠ ధామాలు నిర్మాణాలు చేపట్టినప్పటికీ గ్రామానికి దూరంగా ఉండడం, నీటి సౌకర్యం, సౌర విద్యుత్తు ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో అంతంతమాత్రంగానే ఉన్నాయి. పలు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు సొంత పొలాల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. కొన్ని వర్గాలు కేవలం ఖననం మాత్రమే చేస్తాయి. ఆ వర్గాలకు వైకుంఠధామాల వల్ల ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారుల పర్యవేక్షణ పెరిగి వినియోగంలోకి తీసుకొస్తే లక్ష్యం నెరవేరనుంది.

సిబ్బంది కొరతతో ఇబ్బందిపంచాయతీలలో పాత జనాభా ప్రాతిపదికన కార్మికులను నియమించుకునే అవకాశం ఉండడంతో ఇబ్బందిగా మారుతుంది. దీనివల్ల చెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువు తయారీ చేయడం కష్టంగా మారుతుంది. చిన్న పంచాయతీలలో ఇబ్బందిగా ఉన్నప్పటికీ పలు పంచాయతీలలో ప్రత్యేకంగా సిబ్బంది నియామకం చేపట్టి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.
శశికుమార్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి, సారంగాపూర్

# ఆగని అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా



హైదరాబాద్ : నగరం నడిబొడ్డున అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా కొనసాగుతోంది. జనావాసాల మధ్య నిర్భయంగా దందా చేస్తున్న కేటుగాళ్లు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా కాచిగూడలో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసులు దాడి చేసి 98 గ్యాస్ సిలిండర్లు, రీఫిల్లింగ్ మెషీన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంతపెద్ద మొత్తంలో గ్యాస్ సిలిండర్లు దొరికాయంటే దందా ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పనక్కర్లేదు. శివార్లలోనూ ఇదే పరిస్థితి... మే 26న జల్‌పల్లి ప్రాంతంలో కొంతకాలంగా నిర్వహిస్తున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రం బాగోతాన్ని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు బహిర్గతం చేశారు. 100 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను మారుస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కేంద్రం జనావాసాల మధ్యే ఉండటం గమనార్హం. ఇలాంటి కేంద్రాల్లో గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తున్న క్రమంలో పేలుళ్లు సంభవించి మరణాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఏజెన్సీల బాధ్యులే కీలకం...నగరంలో కొన్నేళ్లుగా గ్యాస్ రీఫిల్లింగ్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. డెలివరీ బాయ్‌లు, ఏజెన్సీల నిర్వాహకులే ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. సంబంధిత ఏజెన్సీల ఆటోడ్రైవర్లే ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. వినియోగదారుల ఖాతా పుస్తకాలతో బుకింగ్, విక్రయించడం నుంచి ఏజెన్సీలతోనే డీల్ కుదుర్చుకునే వరకు దందా విస్తరించింది. బల్క్‌గా 14.5కేజీల గృహావసర సిలిండర్లను కొనుగోలు చేసి 19 కేజీల వాణిజ్య సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్నారు. దీంతో ఆయిల్ కంపెనీలకు వాణిజ్య సిలిండర్ల ద్వారా సమకూరే ఆదాయానికి గండిపడుతోంది. గృహావసర సిలిండర్ ధర ప్రస్తుతం రూ.855. కొందరు ఖాతాదారులకు రూ.355 సబ్సిడీ వస్తోంది. వినియోగదారుల కోటా నుంచి సిలిండర్లను వాడుకుంటున్న కేటుగాళ్లు సబ్సిడీ మొత్తం మీరే తీసుకోవాలని లేదా ముందస్తుగానే కొంత మొత్తం అప్పగిస్తున్నారు. ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ (19కేజీలు) ధర రూ.1903. డొమెస్టిక్ సిలిండర్ నుంచి ఫిల్లింగ్ పైపుల ద్వారా గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్‌లోకి రీఫిల్లింగ్ చేస్తూ ఒక్కో సిలిండర్‌పై సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు సొమ్ము చేసుకుంటున్నారు. 5 కేజీల సిలిండర్లను సైతం ఇలాగే రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో సిలిండర్ రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. గతంలో జగద్గిరిగుట్టలో ఈ దందా చేస్తున్న 9 మందిని బాలానగర్ జోన్ ఎస్‌వోటీ, జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 267 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. (డొమెస్టిక్ - 67, కమర్షియల్- 190) ఉన్నాయి. ఇందులో ఏజెన్సీ నిర్వహించే వ్యక్తే ప్రధాన నిందితుడని తేలింది.

గతంలో అనేక ఘటనలు..

రెట్టింపు లాభాలు పొందొచ్చనే దురాశతో కొందరు జనావాసాల్లోనే ఈ రీఫిల్లింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రమాదవశాత్తు సిలిండర్లు పేలిన ఘటనల్లో ఎంతోమంది మరణించిన దాఖలాలున్నాయి. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన ఇద్దరు వ్యక్తులు నార్సింగిలో కిరాణా దుకాణం నిర్వహిస్తూనే మరో అద్దెగదిలో రీఫిల్లింగ్ దందా ప్రారంభించారు. ఈ క్రమంలో వంటగ్యాస్ సిలిండర్ నుంచి చిన్న సిలిండర్లలోకి గ్యాస్ నింపుతుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లగా మరుసటిరోజు వారు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కర్మన్‌ఘాట్‌లోని భూపేష్‌గుప్తా నగర్‌లో ఇలాగే రీఫిల్లింగ్ చేస్తుండగా ఒకేసారి ఐదారు సిలిండర్లు పేలిపోయాయి. ఇనుప ముక్కలు వందమీటర్ల దూరంలో పడిపోయాయి. జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. సుభాష్‌నగర్‌లో ఇళ్ల మధ్యే రీఫిల్లింగ్ చేస్తున్న సమయంలో పేలుడు సంభవించి ఓ వ్యక్తి మృతి చెందగా.. ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.

# అందని రుణం.. ఎందుకీ జాప్యం



తాండూరు : యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేసి వారు తమ సొంత కాళ్లపై నిలదొక్కుకుని ఆర్థికంగా ఎదగాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరటం లేదు. జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలు సర్కారు చేయూత కొరవడి ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. 2017-18 దరఖాస్తులకు నేటికీ దక్కని మోక్షం: ప్రభుత్వం రుణాలకు రాయితీ మంజూరు చేయక పోవటంతో తగిన ప్రోత్సాహం లేక దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 2017-18 సంవత్సరానికి రాయితీ రుణాల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దీంతో కొత్తగా దరఖాస్తులను చేసుకోవడానికి బీసీ యువత ముందుకు రావటం లేదు. దీనికి తోడు అధికారులు కూడా వీరిని ప్రోత్సహించటం లేదనే విమర్శలున్నాయి. ఏడు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్న వారికే రుణ రాయితీ మంజూరు కాలేదు. కొత్తగా దరఖాస్తు చేయడం దండగ అని విమర్శిస్తున్నారు.

6 లక్షల మందికి పైగా బీసీ జనాభా: జిల్లాలో సుమారుగా 12.5 లక్షల జనాభా ఉంది. వీరిలో 6.50 లక్షల మంది బీసీలున్నారని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి కోర్సులను పూర్తి చేశారు. స్వయం ఉపాధి రుణాల కోసం ఏడు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంత మంది సొంతంగా వ్యాపారాలు చేసేందుకు కుల వృత్తుల్లో స్థిరపడేందుకు చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి వాటిని నిర్వహించేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. వారికి సరైన ఆర్థిక వనరులు, పెట్టుబడులు లేక ప్రభుత్వం అందించే రుణాలపై ఆశలు పెంచుకున్నా ప్రయోజనం కలగడంలేదని వాపోతున్నారు.

రూ.లక్ష ఆపై వారికి ఎప్పుడిస్తారో తెలియదు

లబ్ధిదారులు ఎంచుకున్న పథకాన్ని బట్టి కేటగిరీల వారీగా విభజించారు. లక్ష లోపు యూనిట్లకు దరఖాస్తు చేసిన వారికి శత శాతం రాయితీ కింద రూ.50,000 ఇవ్వాలని నిర్ణయించారు. దీని కింద జిల్లాలో 1100 మంది లబ్ధి పొందారు. రూ.లక్ష లోపు యూనిట్లకు కేటగిరీ-1, రూ.2లక్షల వరకు ఉన్న యూనిట్లకు కేటగిరీ-2, అంతకు మించిన వాటికి కేటగిరీ-3గా నిర్ణయించారు. రూ.లక్ష ఆపై దరఖాస్తు చేసుకున్న వారికి రుణం మంజూరు చేయలేదు. రాయితీ రుణాలు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి. ఏడు సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితే ఉంటే ఎలా ఉపాధి పొందాలని లబ్ధిదారులు వాపోతున్నారు. మూడుసార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదుట్రాక్టర్ కొనుగోలుకు బీసీ కార్పొరేషన్ రుణం కోసం నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నా. సరిగ్గా చూశారో లేదోనని మూడుసార్లు దరఖాస్తు సమర్పించా. ఫలితం మాత్రం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి రాయితీ నిధులు విడుదల చేయాలి.యాదగిరి యాదవ్, పీరంపల్లి, వికారాబాద్ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న యువత ఎదురుచూస్తున్నారు ఈ విషయం మాకూ తెలుసు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. వస్తే రుణాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. ఉపేందర్, బీసీ సంక్షేమ శాఖాధికారి

# ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల వసూళ్ల పంచాయితీ

హైదరాబాద్: స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో), డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) పోలీసుస్టేషన్‌కు రెండు కళ్లలాంటివారు. అలాంటి వారిద్దరి మధ్య వసూళ్ల పంపకాల్లో తేడా చిచ్చుపెట్టింది. ఠాణాలోనే వాగ్వాదానికి దిగారు. సైబరాబాద్‌లోని ఓ ఠాణాలో వారి తీరు చర్చనీయాంశంగా మారింది. కేసులను విభజించి వాటాలు పంచుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది.

ఇద్దరిదీ ఒకే బ్యాచ్..!సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శాసనసభ ఎన్నికల తర్వాత బదిలీల్లో భాగంగా ఒకే బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు పోస్టింగ్ వచ్చింది. ఒకరు ఇన్‌స్పెక్టర్(ఎస్‌హెచ్‌వో), ఇంకొకరు డీఐగా బాధ్యతలు చేపట్టారు. నెల క్రితం ఓ చీటింగ్ కేసులో కొంత డబ్బు ముట్టడం.. వాటాలు పంచుకునే దగ్గర తేడా వచ్చింది. ఠాణాలో ఉన్నామనే విషయాన్ని వారు మర్చిపోయి ఒకరికొకరు నోరు పారేసుకున్నారు. సాయం.. వేధింపులు అదే ఠాణా పరిధిలో ఒక ఇంటి యజమాని.. తన ఇంట్లో ఉంటున్న వ్యక్తి అద్దె ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి అద్దెకు ఉంటున్న వ్యక్తిని ఖాళీ చేయించారు. హమ్మయ్య అనుకున్న ఆ యజమానిపై మరో పిడుగు పడింది. ఇంటిపై కన్నేసిన ఇన్‌స్పెక్టర్ తాను ఉంటానని హుకుం జారీ చేశాడు. నెలకు రూ.40 వేల అద్దె చెల్లించాల్సి ఉండగా..అందులో సగం ఇచ్చి ఉంటున్నట్లు సమాచారం. ఈ సగం అద్దె వ్యవహారం అధికారులకు తెలిసిపోయింది.డీఐ బూతుపురాణంఇన్‌స్పెక్టర్ వాగ్వాదానికి దిగిన డీఐ ప్రవర్తనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన కింది సిబ్బందితో బూతులు తిడుతూ మాట్లాడతాడని ఆయనకు పేరుంది. కిందిస్థాయి సిబ్బందే అయినా శాఖలో ఆయన కంటే సీనియర్లని చూడకుండా అసభ్యంగా మాట్లాడతాడని సమాచారం.

# నీటి వృథాను అరికట్టే సెన్సర్

హైదరాబాద్: ఇళ్లు, అపార్టుమెంట్లలో నల్లాల ద్వారా వృథా అవుతున్న నీటికి అడ్డుకట్టవేసేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధక బృందం ఒక సెన్సర్‌ను రూపొందించింది. బహుళ అంతస్థుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో నీటి వృథాను ఎలా అరికట్టాలన్న అంశంపై ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ రీసెర్చ్ సెంటర్ సహ ఆచార్యులు సచిన్ చౌదరి కొన్నేళ్లుగా తన విద్యార్థులతో పరిశోధనలు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలల కిందట సెన్సర్‌తో కూడిన పరికరాన్ని తయారు చేశారు. ప్రయోగాత్మకంగా కొన్ని ఇళ్లు, అపార్టుమెంట్లలోని నల్లాలకు బిగించి పరిశీలించారు. నీరు వృథాగా వెళ్తున్నప్పుడు సెన్సర్ అప్రమత్తం చేయడాన్ని గుర్తించారు. దీంతోపాటు ఒక నల్లా నుంచి అధికంగా నీరు సరఫరా అవుతున్నట్లు ఆ సెన్సర్ పరిశీలించడాన్ని గమనించారు. అనంతరం తమ తరహాలో ఎవరైనా సెన్సర్లు రూపొందించారా? దీనికన్నా భిన్నమైన పరికరం ఉందా ? అని సెన్సర్లు తయారు చేస్తున్న ఇంజినీరింగ్ కంపెనీలను వాకబు చేశారు. పరిశోధన సంస్థల నుంచి సమాచారాన్ని సేకరించారు.



ఈ పరికరాన్ని పోలిన విధంగా సెన్సర్లు లేవని తెలుసుకున్నారు. వెంటనే పేటెంట్‌కు దరఖాస్తు చేసుకోగా ఇటీవలే పేటెంట్ వచ్చిందని పరిశోధక విద్యార్థులు జాయ్, థామస్ డేవిడ్ తెలిపారు.

నల్లా, మీటర్‌కు బిగిస్తే సరి

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధకులు రూపొందించిన సెన్సర్ పరికరాన్ని నల్లాకు, మీటర్‌కు బిగిస్తే సరిపోతుంది.మనం సొంతంగా కాకుండా ప్లంబర్‌ను పిలిపించి అమర్చుకుంటే ఎక్కువకాలం పనిచేస్తుంది. రూపాయి బిళ్లంత పరిమాణమున్న ఈ సెన్సర్ పనిచేసేందుకు లోపల చిన్న బ్యాటరీలు ఉంటాయి. నల్లాపై అమర్చిన వెంటనే దాని నుంచి వచ్చే నీటివేగం, పరిమాణం ఆధారంగా సెన్సర్ పనిచేయనుంది. నల్లా కట్టకపోయినా.. కట్టేసినా అందులో లీకేజీలున్నా.. అలారం ద్వారా అప్రమత్తం చేస్తుంది. ఇటీవలే కొన్నింటిని తయారు చేశామని, వాణిజ్య అవసరాలకు వీలుగా రూపొందిస్తున్నామని పరిశోధక విద్యార్థులు జాయ్, థామస్ డేవిడ్ వివరించారు. ఈ సెన్సర్ ధర రూ.2వేల వరకు ఉంటుందన్నారు. ఈ తరహావి మార్కెట్‌లో ఉన్నా.. ఖరీదు ఎక్కువ గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల్లో మాత్రమే వినియోగించుకునేందుకు అనుకూలంగా ఉంటున్నాయి.

# భూమాతకు ఆరోగ్య కార్డులు

చేగుంట: భూమిలో సారం బాగుంటే దిగుబడులు ఎక్కువగా వస్తుంటాయి. కానీ అందులో సారం ఎంత ఉందో రైతులకు తెలియదు. ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువులను వాడుతుంటారు. దీనివల్ల పెట్టుబడులు ఎక్కువ కావడంతో పాటు భూమిలో సారం తగ్గిపోతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడులు తగ్గించుకొనేందుకు మట్టి నమూనాలు ఉపయోగపడతాయని భావించిన కేంద్రం.. భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. నేల స్వభావాన్ని బట్టి ఎరువుల వినియోగించేలా.. అనువైన పంటలు సాగు చేసే విధంగా అన్నదాతలకు అవగాహన పెంచేందుకు ఇవి ఎంతో ఉపకరించనున్నాయి. గతంలో చేపట్టి వదిలేసిన భూసార పరీక్షలు మళ్లీ పురుడు పోసుకోనున్నాయి. జిల్లాకు ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 2024-25 సంవత్సరానికి జిల్లాలో నార్సింగి మండలాన్ని గుర్తించారు. ఈ మండలంలో 1607 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నార్సింగి మండలంలో 12,356 ఎకరాల భూమి ఉంది. ఇందులో 8035 ఎకరాలు సాగు భూమిగా వినియోగంలో ఉంది. 5439 మంది రైతులు ఉన్నారు. అలాగే 1680 ఎకరాలు నల్లరేగడి, 1250 ఎకరాలు ఎర్ర నేలలు, 5105 ఎకరాలు చల్క నేలలు ఉన్నాయి. ఇలా చేస్తారు: వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవో) తన క్లస్టర్‌లో రెండున్నర ఎకరాలు(హెక్టారు)కు ఒక మట్టి నమూనా సేకరించాలి. ప్రతి క్లస్టర్‌లో ఓ ఆదర్శ రైతును ఎంపిక చేసుకొని రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రదర్శన క్షేత్రం నిర్వహించాలి. ప్రయోగాత్మకంగా తీసుకున్న చోట జులై 10 లోపు నమూనాల సేకరణ పూర్తి చేయాలి. మట్టి నమూనాల వివరాలను సాయిల్ హెల్త్‌కార్డు పోర్టల్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. జులై 31 వరకు పరీక్ష కేంద్రంలో నమూనాల విశ్లేషణ పూర్తి చేయాలి. ఆగస్టు రెండో వారంలో పరీక్ష ఫలితాలను రైతులకు ఆరోగ్య కార్డు రూపంలో పంపిణీ చేయాలి.

పైలట్ ప్రాజెక్టుగాజిల్లాలో చాలా మండలాల్లో ముందుగానే సాగు ప్రారంభమైంది. రామాయంపేట ఏడీఏ పరిధిలోని నార్సింగి మండలంలో కొంత ఆలస్యంగా నాట్లు, ఇతర పంటలు వేయనున్నారు. అందుకే ఇక్కడ మొదలుపెట్టాలని అధికారులు భావించారు. ముందుగా వానాకాలం సీజన్‌లో 40 శాతం పూర్తిచేసి మిగతాది ఏడాదిలో పూర్తిచేసి ఇవ్వనున్నారు. మట్టి నమూనా తీసిన ప్రతి చోట నేలకు సంబంధించిన ఆరోగ్య కార్డు ఇవ్వనున్నారు. ఆ కార్డును బట్టి ప్రతి సీజన్‌లో రైతులు ఎరువులు వేసుకోవటానికి అవకాశం ఉండనుంది.రెండున్నర ఎకరాలకు ఒక నమూనాగతంలో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించేవారు. ఇప్పుడు మాత్రం రెండున్నర ఎకరాలకు ఒకటి చొప్పున తీయనున్నారు. దీంతో ప్రతి అంగుళంలో మట్టి గురించి తెలుసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. దీనిద్వారా ఏ నేలలో ఎంత మేర రసాయన ఎరువులు వాడవచ్చని తెలుస్తోంది. ఒక్కోచోట ఒక్కో విధంగా భూమి లోపల నిల్వలు ఉంటాయి. మట్టి నమూనాల వల్ల ఆ భూమిలో ఎంతమేరకు ఎలాంటి ఎరువులు వాడవచ్చునో పూర్తిగా తెలిసిపోతుంది. దీనిని బట్టి రైతులకు ఎరువుల ఖర్చు కూడా చాలా వరకు తగ్గిపోతుంది. అంతేకాకుండా భూమిలో సారం పెరిగి దిగుబడులు కూడా ఎక్కువగా వస్తుంటాయి. ఆరోగ్య కార్డుల ద్వారా రైతుకు తన భూమి ఎంతమేరకు సారవంతమో తెలిసి ముందుకు సాగేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నార్సింగి మండలంలో పూర్తిస్థాయిలో విజయవంతం అయితే జిల్లా వ్యాప్తంగా దీనిని అమలు చేయనున్నారు. రైతులు మట్టి నమూనాలు తీసి ఇస్తే వారికే మేలు జరుగుతుంది.రైతులకు ఎంతో ప్రయోజనం: గోవింద్, డీఏవోమట్టి పరీక్షలు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. జిల్లాలో నార్సింగిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయటం జరిగింది. మట్టి నమూనాలు సేకరించిన చోట రైతులకు నేల ఆరోగ్య కార్డు ద్వారా ఫలితాలు అందిస్తాం. అందులో భూమికి సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుంది. ఇది రైతుల వద్ద ఉంటే ఏ పంట సాగుచేస్తే ఎలాంటి ఫలితం ఉంటుంది, ఎరువుల మోతాదు ఎంత అనే విషయాలు ఏవోలు, ఏఈవోల ద్వారా తెలుసుకొని పంటలను పండించుకోవచ్చు. మట్టి నమూనాల సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నాం.



# దేశానికి పీవీ చేసిన సేవలు మరువలేనివి.. కొనియాడిన కేటీఆర్

హైదరాబాద్ : దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీవీ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ సేవలను గుర్తు చేసుకున్నారు. కేటీఆర్ మాట్లాడుతూ.. హస్తినలో ప్రధాని పీఠాన్ని అధిష్టించిన మొదటి దక్షిణ భారత నాయకులు పీవీ నరసింహారావు అని పేర్కొన్నారు. దేశానికి పీవీ చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ప్రమాదపు అంచున ఉన్న దేశానికి ఆర్థిక దిశానిర్దేశం చేసిన ప్రధాని మన పీవీ అని ప్రశంసించారు. దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపిన వ్యక్తి మన పీవీ. బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావును దేశం ఎన్నటికీ మరిచిపోదు. భూసంస్కరణల్లో భాగంగా 8 వందల ఎకరాల భూమిని సర్కార్‌కు అప్పగించిన గొప్ప నాయకుడు పీవీ. విద్యాసంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నతుడు పీవీ. పీవీ నరసింహారావుకు భారతరత్న కోసం అసెంబ్లీలో తీర్మానం చేశాం. భారతదేశాన్ని ప్రపంచపటంలో ఉన్నతంగా నిలిపారు పీవీ. నెక్లెస్ రోడ్డుకు పీవీ పేరు నామకరణం చేశాం. అక్కడే ఆయన విగ్రహం ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

# దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు.. భారతజాతి ముద్దుబిడ్డ పీవీ: కేసీఆర్



హైదరాబాద్: బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.

**పీవీ కోసం బీఆర్ఎస్ చేసిన కృషి..** భారతరత్న కోసం బీఆర్ఎస్ డిమాండ్.. అసెంబ్లీలో తీర్మానం, కేంద్రానికి లేఖ. 2015, సెప్టెంబర్ 9న పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలంటూ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సిఫారసు. 2020, జూన్ 18న పీవీకి భారతరత్న ఇవ్వాలంటూ కేంద్రానికి పీవీ శతజయంతి ఉత్సవ కమిటీ సిఫారసు. 2020, సెప్టెంబర్ 8న పీవీకి భారతరత్న ఇవ్వాలంటూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం. ఏడాది పొడవునా ఘనంగా శతజయంతి వేడుకలు. రాష్ట్రంలో వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరుపెట్టి తన అభిమానాన్ని చాటుకున్న కేసీఆర్. 2020, అక్టోబర్ 20న పీవీ పేరిట స్మారక స్టాంప్ కోసం అప్పటి రాష్ట్రపతి కోవింద్‌కు కేసీఆర్ లేఖ. 2020, జూన్ 28న హెచ్‌సీయూకు పీవీ పేరు పెట్టాలని ప్రధాని మోదీకి కేసీఆర్ లేఖ. 2021 జూన్ 28న నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్‌గా నామకరణం, పీవీ మార్గ్‌లో పీవీ విగ్రహం ఆవిష్కరణ. బీఆర్ఎస్ తరఫున పీవీ కుమార్తె వాణీదేవికి ఎమ్మెల్సీగా అవకాశం.

# కేసీఆర్ పిటిషన్‌పై ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు



హైదరాబాద్: కరెంటు కొనుగోళ్లు, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయంలో లోటుపాట్లను సమీక్షించడానికి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటుపై మాజీ సీఎం, భారాస అధినేత కె.చంద్రశేఖర్‌రావు దాఖలు చేసిన పిటిషన్ విచారణ ముగిసింది. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై సీజే ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఎక్కడా వివాదాలకు పోలేదని తెలిపారు. విద్యుత్ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరించలేదని కోర్టుకు వివరించారు. విలేకరుల సమావేశంలో ఆయన ఎక్కడా వివాదాస్పద అంశాలు మాట్లాడలేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




దిల్లీ: భారత రాష్ట్ర సమితి (భారాస)కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే.

దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.




న్యూఢిల్లీ: సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించిన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్ర ద్వారా ఐక్యతను చాటి చెప్పిన రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రతిపక్ష నేతగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై మంత్రి మండలి కూర్పు, ఆర్గనైజేషన్ గురించి చర్చించామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ ప్రభుత్వంపై కుట్రలు, కుతంత్రాలు చేస్తూ.. కూల్చివేస్తామని ప్రకటిస్తున్నాయన్నారు. మరోవైపు కాంగ్రెస్‌లో చేరికల అంశంపై కూడా చర్చించామన్నారు. కాగా పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్థిక పరమైన సంస్కరణలు తెచ్చి ప్రపంచ పోటీలో భారతదేశాన్ని నిలిపారన్నారు. భారతదేశ పాలనలో తెలుగువారి ముద్రవేసి గర్వపడేలా చేశారని, పీవీ భవిష్యత్ తరాల పాలనకు పునాదులు వేసారన్నారు. రాష్ట్రప్రభుత్వం పీవీ మార్గాన్ని అవలంబిస్తోందని, ఆయన ఆలోచనలు ముందుకు తీసుకు వెళుతుందని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మరోవైపు ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదో రోజు శుక్రవాం పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఇవాళ మరోసారి కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపా దాస్ మున్షీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,శ్రీధర్ బాబు సమావేశం కానున్నారు. మంత్రివర్గం విస్తరణ, టీపీసీసీ నియామకం, ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకునే అంశం, పార్టీలోని తాజా రాజకీయ పరిణామాలపై అధిష్టానం పెద్దలతో చర్చలు జరపనున్నారు. కాగా నిన్న (గురువారం) అర్ధరాత్రి వరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ నేతలు చర్చించారు. పూర్వ నిజామాబాద్, అదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా నేతలకు మంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశం ఉంది.

# పీవీ సేవలను తెలుగు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: దివంగత ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలను తెలుగు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నేత అని చెప్పుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పీవీ ఘాట్‌లో మంత్రి సహా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. "పీవీ నరసింహారావు సంస్కరణలు అమలు చేయకపోయుంటే దేశం ఇవాళ ఈ స్థితిలో ఉండేది కాదు. ఆయన మేధావి కాబట్టే అద్భుతమైన పాలన అందించారు. తెలుగుబిడ్డ, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నా" అని కోమటిరెడ్డి తెలిపారు.

భూసంస్కరణలు అమలు చేయాలని ఇందిరా గాంధీకి పీవీ చెప్పారు. **– వీహెచ్, కాంగ్రెస్ సీనియర్ నేత**

సోషలిస్టు భావాలు కలిగిన నేత పీవీ. ఆయన అమలు చేసిన భూసంస్కరణలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ మౌలిక స్వభావాన్నే మార్చేశాయి. **– కోదండరాం, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు**

పీవీ ఆర్థిక సంస్కరణల స్ఫూర్తిని తరువాత వచ్చిన ప్రధానులు కొనసాగించారు. **– జానారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత**

తొలి తెలుగు ప్రధాని పీవీ అని ఇవాళ మనం రాసుకుంటున్నాం. మైనారిటీ ప్రభుత్వాన్ని చక్కగా పాలిస్తూ దేశాన్ని తీర్చిదిద్దారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేశారు. **- సురభి వాణీదేవి, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ**

# ఎమ్మెల్సీ కవితతో మాజీ మంత్రి హరీష్ రావు ములాఖత్



న్యూఢిల్లీ : తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21వ తేదీన ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. కాగా, కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# ఉపాధ్యాయులను నియమించండి.. మెదక్ జిల్లాలో రోడ్డెక్కిన విద్యార్థులు



మెదక్ : మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం పరిధిలోని శాలిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కొత్తగా ఉపాధ్యాయులను నియమించండంటూ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే వంటావార్పు చేస్తూ నిరసనలు తెలిపారు. ఉపాధ్యాయులను నియమించే వరకు రోడ్డుపైనే తమ నిరసన కొనసాగుతుందని విద్యార్థులు తేల్చిచెప్పారు. శాలిపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఇద్దరు మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యా యులు లేరని వెంటనే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని తమకు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా కొనసాగేటట్టు చూడాలని వారి తల్లిదండ్రులు కోరారు. గవలపల్లి %–% రామాయంపేట రోడ్డుపై విద్యార్థులు బైఠాయించారు. టీచర్లు కావాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసనలు తెలిపారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660